# గోదారమ్మ-19

కానీ సీత మరుక్షణమే తేరుకుని, కలవరపాటును కప్పిపుచ్చుకుంటూ .... ''ఇది నాకు తెలియనే తెలియదమ్మా. ఏదో నాలుగురోజులు వాళ్ళని ఇంట్లో పెట్టుకుంటే ఏమవుతుందీ అనుకున్నానంతేగానీ ఇలాంటి అపాయం ఉండొచ్చనే ఆలోచనే నాకు రాలేదూ...!'' అంది మెల్లగా.

''అవును సీతా... మొదట్లో నాకూ కొంచెం ఆందోళన కలిగింది, ఈ విషయం ఎటునుండి ఎటు పోతుందోనని! కానీ ఇద్దరి తల్లిదండ్రులూ అమాయకులే. వాళ్ళని కలిసి మాట్లాడాక, కొంత నిశ్చింతగా వున్నాను. కొందరికి మధ్యలో వచ్చిన డబ్బుతో అహం పెరిగి... పరువంటూ పట్టుదలలు పెంచుకుంటారు! ఎపుడో చివరకు తెలుసుకుంటారు, అలాంటి చర్యలవలన సాధించేదేమీ ఉండదని! తల్లిదండ్రులుగా కన్న పిల్లలను రెక్కలొచ్చేవరకూ పెంచి పోషించటమే, తల్లిదండ్రుల భాద్యత! అంతకు మించి ఆశలు పెంచుకోవటం, బాధ్యతలూ పెట్టుకోకపోవటమే సుఖం... ఎవరికైనా!'' అంటూ ఆవిడా నిట్టూర్చింది.

సీత ఏం మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండిపోయింది. అయినా తన శరీరంలో తగ్గని చిరు కంపనను గుర్తించిన గోదావరమ్మ, అనునయంగా సీత చేయిని పట్టుకుంది.

''సీతా భయంలేదులే...! అయినా ఈ మాటలు నీకు ఎందుకు చెప్పానంటే రామచంద్ర వ్యక్తిత్వంలోని గొప్పదనం నీకు అర్థం అవుతుందనే....!''

సీత కొంచెం మామూలుగా అయింది. ''అవునమ్మా.. ఆలోచిస్తుంటే రామచంద్ర మాటల్లోని నిజం, అతని గొప్పతనం తెలుస్తున్నాయి! నిజానికి మరణం గురించి చెప్పుకోవాలంటే ఎపుడు వస్తుందో ఎవరికీ తెలియని విషయమే! కానీ అందరూ మాత్రం తమకి అదెంతో దూరమనే అనుకుంటారు. అన్నీ సవ్యంగా జరిగి, వయసు అయిపోయి, భాద్యతలు తీరాక, తెలియకుండా వెళ్ళిపోవటం అంత బాధనిపించదు కానీ అర్థాంతరంగా చిన్న వయసులో మరణం సంభవించినపుడే బంధం ఏర్పరుచుకున్నవాళ్ళు తట్టుకోలేరు!'' సీత నిట్టూర్చింది.

గోదారమ్మ తనని పట్టుకున్న సీత చేతిని అనునయంగా, ధైర్యం చెబుతున్నట్లుగా ఆత్మీయంగా నొక్కింది.

''భయమేమీ లేదని నే చెబుతున్నాగా... పిల్లలిద్దరి తల్లిదండ్రులనూ చూశాం, మాట్లాడేం.... వాళ్ళెంత అమాయకులో అర్థమైందిగా. అందుకే నాకూ ఏమీ బెంగలేదు! ఇక మిగతా పనులు చూద్దాం...'' అంది గోదారమ్మ.

అందరూ కలిసి శివానంద్, కమలా అద్దెకు తీసుకున్న ఇంట్లో కొత్త కాపురానికి కావలసిన ఏర్పాట్లు చేశారు. వాళ్ళు వద్దని అంటున్నా గోదారమ్మ కమల చేతిలో కొంత డబ్బు పెట్టి కావలసినవి కొనుక్కోమని చెప్పింది.

వాళ్ళిద్దరూ పదేపదే గోదారమ్మకీ, సీతకీ, కృతజ్ఞతలు చెబుతోంటే... గోదారమ్మ 'మాదేముంది... ఇదంతా రామచంద్ర చేసిన పనే!' అంటూ  ఆవిడ తేల్చేసింది.

వాళ్ళు ఏక కంఠంతో మళ్ళీ చెప్పారు ''నిజమే, రామచంద్ర గారు పూనుకుని... మాకు పెళ్ళిచేస్తానని మాటఇచ్చినా, సీతగారు మమ్మల్ని తోబుట్టువులా ఆదరించారు. మీరేమో మా ఇద్దరి అమ్మానాన్నలతో సామరస్యంగా మాట్లాడి ఎవరికీ వాళ్ళు ఏ అపకారం తలపెట్టని విధంగా శాంత పరిచారు! ఇదంతా మీరు చేసిందే కదమ్మా...!'' అన్నారు గోదారమ్మతో.

గోదారమ్మ ఆనందంగా "రెండేళ్ళ ఎడబాటులో కూడా మీరిద్దరూ కలిసి ఉన్న తీరు, మీ మధ్య వున్న అవగాహనా, ప్రేమ మీ తల్లిదండ్రులలో కూడా మార్పును తీసుకువచ్చింది. మీరిద్దరూ ఇలానే కలకాలం కలిసి వుండాలని, కష్టాలలో ఒకరికొకరు తోడుగా నిలబడాలని కోరుకుంటున్నాను. మీకు మా అందరి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ వుంటాయి" అంది.

వాళ్ళిద్దరూ కూడా.." అమ్మా...మీ పరిచయం మాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మీరు ఈ గ్రామంలో తలపెట్టిన కార్యక్రమాలు చూసాం. మేము కూడా మా వంతు సహకారానికి ఎప్పుడూ తయారుగా వుంటాం. దయచేసి ఈ యజ్ఞంలో మమ్మల్నీ పాలు పంచుకోనివ్వండి. మొక్కలపని కూడా మేమే చూస్తాం... మీరేం చేయకండి. దగ్గిరే కాబట్టి కనిపిస్తూ ఉంటాం'' అంటూ వాళ్ళిద్దరూ అందరి దగ్గరా సెలవు తీసుకుని, తమ ఇంటికి వెళ్ళారు.

* * *

ఆరోజు.... దగ్గరకు వచ్చి కూర్చున్న సీతతో, గోదారమ్మ అంది ''కమలా వాళ్లు ఉన్నప్పుడు ఇల్లంతా ఎంత సందడిగా ఉండేదో...! ఇపుడు కొంచెం శూన్యం ఏర్పడినట్లుగా ఉంది... ఎక్కువమంది మనుష్యులు ఉంటేనే ఇల్లు కళకళలాడుతూ ఉంటుందన్న మాట!''

సీత నిట్టూర్చింది. ''మామూలుగా అది నిజమే కానీ అమ్మా... ఇప్పుడు మాత్రం, నేనేమో, ఎపుడు ఇలాంటి ఏకాంతం దొరుకుతుందా అని చూస్తున్నాను! వాళ్ళిద్దరూ వెళ్ళిపోయినాగానీ, ఎపుడూ ఎవరో ఒకరు మీ దగ్గరకు వస్తూనే ఉంటారు కదా... ఏవో సలహాలకోసం... సహాయం కోసం... '' అంటూ చిన్నగా నవ్వింది.

''అవునీరోజు నీకూ బడిలేదు... రామచంద్ర పనిమీద, పిల్లలు ఆడుకోవటానికి బయటకు వెళ్ళారు. పనులన్నీ పూర్తయిపోయాయి. కాబట్టి ఇప్పుడు చెప్పు...... నువ్వెందుకిలాంటి ఏకాంతం కోసం ఎదురుచూస్తున్నట్లూ...?''

ఆవిడ ప్రశ్నకు సీత చిన్నగా నవ్వుతూ "మనిమిద్దరమే ఉన్నపుడు మీ గురించి చెబుతానన్నారు... గుర్తు లేదామ్మా..?? నాకిలా ఇంట్లో ఎవరూ లేకుండా, మన ఇద్దరమే ఉండే అవకాశం కోసం చూస్తున్నా...! మీరెందుకీ వూరు వచ్చారో తెలుసుకోవాలని నాకు చాలా ఉత్సుకతగా ఉంది మరి!" అంది.

గోదారమ్మ "అదా సంగతీ" అంటూ నిట్టూర్చింది.

"నా గురించి చెప్పుకోవటానికి పెద్దగా ఏంలేదుగానీ క్లుప్తంగా చెబుతాలే..." అంటూ ఆవిడ చెప్పటం మొదలు పెట్టింది.

"డబ్బు గురించిన ఒడిదుడుకులన్నీ సర్దుకున్నాక, మా అబ్బాయి వలన వ్యాపారం బాగానే సాగింది. ఒక గొప్పింటి అమ్మాయితో పెళ్ళీ జరిగింది. రాగిణి పెద్ద కోడలిగా మా ఇంట్లో అడుగు పెట్టింది. రెండోవాడు చదువుకుంటున్నాడు.

నా చిన్నపుడు మా బంధువర్గంలోని ఒకావిడ వాళ్ళమ్మాయి సావిత్రితో తరచూ మా ఇంటికి వస్తుండేది. సావిత్రికి పెళ్ళి జరిగింది. ఒక కూతురూ ఉంది. తల్లి లేదు, భర్త చనిపోయాడు. జరుగుబాటులేక... తెలిసిన వాళ్ళెవరి ద్వారానో నా అడ్రసు సంపాదించి ఇంత దూరం వచ్చింది. ఏదైనా పని చేసుకుని బ్రతుకుదామని అనుకుంటున్నట్లుగా చెప్పేసరికి మా ఇంట్లోనే ఉండమన్నాను. వంటా వార్పుల బాధ్యత తీసుకుంది. పెళ్ళీడుకొచ్చిన కూతుర్ని మాకు దగ్గరగా ఉన్న కాలేజీలో చేర్చింది, హాస్టలులో పెట్టింది.

అపుడప్పుడూ కాలేజీకి సెలవులిచ్చినపుడు ఆ అమ్మాయి పేరు అంజనలే... వచ్చి మా ఇంట్లోనే తల్లితో పాటూ ఉండి హాస్టలుకు మళ్ళీ వెళ్ళిపోవటం జరిగేది.

ఒకసారి మాకోడలు రాగిణి తమ్ముడు కుమార్ సెలవులకని వచ్చాడు. అపుడే సెలవులని అంజనా కూడా వచ్చి ఇంట్లో ఉంది.

ఆ అంజనా గురించి కొంత చెప్పాలి. హుషారుగా తృళ్ళిపడుతున్నట్లుగా ఉండేది, నడక తెలియనట్లుగా పరుగులు పెట్టేది! ఎపుడూ నవ్వుతూనే కనిపించేది! నాకూ ఆ అమ్మాయిని చూస్తే ఇష్టంగానే అనిపించేది! అయితే ఒకటి రెండుసార్లు... వంటగది పక్కనున్న వరండాలో రాగిణి తమ్ముడు, అంజనా పెద్దగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకోవడం చూశాను. నాకు కొంచెం అభ్యంతరకరంగా అనిపించినా హెచ్చరించలేదు. చిన్నపిల్లలు కదా, సరదాగా మాటలు చెప్పుకోవటం మామూలే అనుకున్నాను.

ఒకసారి అంజనా అతనూ కబుర్లు చెప్పుకుంటూ నాకంటబడినపుడు... ఆ అబ్బాయి హడావుడిగా అక్కడనుండి వెళ్ళిపోయాడు. అంజనా మాత్రం ఏమీ, తత్తరపడకుండా 'అబ్బ... కుమార్ గారు చెప్పే కబుర్లు ఎంతగా నవ్వు

తెప్పిస్తాయో...!' అంటూ పెద్దగా నవ్వింది. అసలే తనకి నవ్వు ఎక్కువ. నేను కొంచెం చిరాకుగా చూసి నా గదిలోకి వచ్చేశాను.

ఆ తర్వాత ఒకరోజు... సావిత్రి వంటగదిలో ఓ మూల కాళ్ళు ముడుచుకుని కూర్చున్న కూతురిని మందలిస్తోంది.

నేనా సమయంలో వంటగదికి వెళ్ళే అలవాటులేదు. ఎందుకోగానీ ఏమీ తోచక ఆ రోజు వెళ్ళాను.

నేను ఆ సమయంలో వస్తానని సావిత్రి ఊహించలేదేమో అందుకని... కూతుర్ని గట్టిగా మందలిస్తోంది.

''ఏం మాట్లాడుతున్నావే... అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేయమంటావా...? అదేం కుదరదు... నేనా పని చేయలేను. ఎవరి హద్దుల్లో వాళ్ళుండాలి! అంతస్థుల గురించి మరిచిపోయి ఆశలు పెంచుకోకూడదు. కొంచెం సందు దొరికిందికదాని అంతా అక్రమించుకోవటం అత్యేశ అవదూ...?'' ఇలా సాగుతోంది సావిత్రి మందలింపు. ఆ పిల్ల ఏం మాట్లాడకుండా వెక్కిల్ళు పెడుతోంది.

నాకు సమస్య ఏమిటో అర్థమయి, అవనట్లుగా ఉంది.

''ఏమిటి సావిత్రీ... విషయం...?'' అంటూ ఆరాదీసాను.

మొదట నన్ను చూసి పాలిపోయిన మొహంతో తెల్లబోయింది. తర్వాత కన్నీళ్ళు పెట్టుకుంది.

బొంగురు గొంతుతో రోదిస్తున్నట్లుగా చెప్పుకొచ్చింది. ''ఏం లేదమ్మా... నా ప్రారబ్దం అంతే! మీ అండలో నిశ్చింతగా బ్రతుకుతున్న జీవితంలో ఈపిల్ల నిప్పులు పోసింది! ఇక్కడ ఇక ఉండలేనమ్మా... మా ఊరుకు పోతా... ఇదొక్కటే గదా నా మెడకు బంధం... అక్కడకు పోయి ఎలాగోలా బ్రతికేందుకు ప్రయత్నం చేస్తాం...!''

''ఏమిటి సావిత్రీ ఆ అర్థం పర్థం లేని మాటలు... అసలు సమస్యేమిటో చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నావు అర్థంకాకుండా...?'' అంటూ నిలదీసాను.

''నేను చెప్పలేనమ్మా నా నోటితో...'' అంటూ నోట్లో చెంగు కుక్కుకుని దుఃఖం ఆపుకుంటూ అక్కడనుండి సావిత్రి వెళ్ళిపోయింది.

నేను నిర్ఘాంతపోయాను! అప్పటికి కొంచెం అర్థమైంది!

తల్లి అక్కడనుండి వెళ్ళిపోగానే ఆ అమ్మాయి అంజనాని ''విషయం ఏమిటమ్మా?'' లాలనగా అడిగాను.

అంజనా వెక్కిళ్ళు పెట్టటం ఆపి నావైపు నిదానం చూసింది.

‘‘నన్ను ఇష్టపడిన వాడిని పెళ్ళిచేసుకుంటానని చెప్పటంలో అంత ఘోరం ఏముందండీ…? అంతస్థుల తారతమ్యం అడ్డొస్తుందా…?’’ అనడిగింది.

నేను విచిత్రంగా చూసేసరికి అంజనా ఇంకో ప్రశ్న వేసింది.

‘‘ఇష్టం, ప్రేమ కలగటం నేరమా…? ఇది అత్యాశ అని అమ్మ అంటోంది! నాపట్ల ఇష్టం చూపించినవారి మాటల్ని నమ్మటమే నేను చేసిన తప్పుకాబోలు!’’

ఆ మాటలకు ఏం సమాధానం చెప్పాలో నాకు తోచలేదు. అక్కడనుండి ఆలోచనలతో లోపలకు వచ్చేసాను.

నవ్వు మొహంతో లోపలకు వస్తున్న రాగిణి తమ్ముడు కుమార్ కనిపించాడు. అప్పుడు నాకు విషయమంతా విపులంగా తెలిసిపోయినట్లయింది. కుమార్ అంజనాకి ప్రేమ కబుర్లు చెప్పి, తీరా పెళ్ళి మాట ఎత్తేసరికి వీలవదని ఖచ్చితంగా చెప్పేసి వుంటాడు. అందుకే సావిత్రి అంతస్తుల భేదం తెలుసుకోకుండా అతని మాటలు నమ్మి మోసపోవటం ఏమిటీ, అని కూతుర్ని నిలదీస్తోందని అర్థం చేసుకోగలిగాను.

ఆ రాత్రంతా అదే ఆలోచన… నాకు మనశ్శాంతి లేకుండా పోయింది. ఏం చేయాలో పాలుపోలేదు.

మా పెద్ద కోడలు రాగిణిని సంప్రదించాలని నిర్ణయించుకున్నాను. చూచాయగా విషయం చెప్పాలని మొదటగా కోడలుతో అన్నాను. ‘‘మీ తమ్ముడు కుమార్ కి కొంచెం నచ్చచెప్పమ్మా… అంజనా మంచి పిల్ల… ప్రేమించటానికి పనికివచ్చే అమ్మాయి పెళ్ళికెందుకు అభ్యంతరం అవుతుందీ…?’’ అనగానే రాగిణి కస్సు మంటున్నట్లుగా నావైపు చూసింది.

‘‘ఏం మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా…?’’ నిష్ఠూరంగా నిలదీసింది.

నేను తడబడకుండా చెప్పాను ‘‘ఎందుకు తెలియదూ… చాలాసార్లు కుమార్ అంజనాతో నవ్వుతూ తుళ్ళుతూ కబుర్లుచెప్పటం నేనే నా కళ్ళతో చూశాను…!’’

మధ్యలోనే రాగిణి కలుగజేసుకుంటూ నవ్వుతూ అంది “అయితే… అందులో తప్పేం ఉందీ…? నాతో కూడా అలా నవ్వుతూనే కబుర్లు చెబుతూంటాడు. మీరూ చూశారుగా…?’’ ఎదురు ప్రశ్నవేసింది.

నేను వెనక్కి తగ్గకుండా కొంచెం పదునుగానే చెప్పాను. ‘‘నీతో కబుర్లు చెప్పటం, అంజనాతో చనువుగా మసలటం ఒకటే అవుతుందా…? ఆ అమ్మాయితో ప్రేమ కబుర్లు చెప్పి నమ్మించి, పెళ్ళి విషయం వచ్చేసరికి తప్పుకోవటం… నీకు తప్పుగా అనిపించటం లేదా…? కుమార్ ని అంజనాతో పెళ్ళికి ఒప్పించే ప్రయత్నం చేస్తే బావుంటుంది…!’’

రాగిణి నిర్లక్ష్యంగా చూసింది.

‘‘అయితే ఆ పని చేయాల్సింది...మీరు...!’’ అంది రాగిణి.

‘‘నేను చెబితే... మీ తమ్ముడు ఎందుకు వింటాడూ... ? మీ కుటుంబంలోని వ్యక్తి కాబట్టి అక్కవు, నువ్వు చెబితే వింటాడని నేనంటున్నాను.’’

‘‘మిమ్మల్ని మా తమ్మడు కుమార్ కి చెప్పమనటంలేదు! మీ రెండో కుమారుడికి చెప్పండి. ఈ విషయం మీకిపుడు తెలిసిందేమోగానీ, నేను రెండు రోజులముందే అంజనా ద్వారా తెలుసుకున్నాను. మీకెలా చెప్పాలా అని తికమకపడుతోంటే... ఈ ప్రస్తావన మీరే తీసుకువచ్చారు!’’

నేను నా సమీపంలో పిడుగుపడ్డట్టుగా అదిరిపడ్డాను.

విస్మయం నుండి కొంచెం తేరుకుని పూడుకుపోతున్న గొంతుతో ‘‘ఏమిటి నువ్వంటున్నది రాగిణీ...?’’ అనడిగాను.

అదే నిర్లక్ష్య వైఖరితో నావైపు చూసిన రాగిణి విసురుగా అంది ‘‘మీకింకా అర్థంకాలేదా... రాగిణిని దూరం పెట్టమని ముందుగా మీ చిన్నబ్బాయికి నచ్చచెప్పి... వాళ్ళని వాళ్ళ వూరు పంపించేయండి. ఇంతకన్నా మీరు చేయగలిగిందేమీ లేదు!’’

నేను నిర్ఘాంతపోయా చాలాసేపు అలాగే ఉండిపోయాను!

నా ఊహకైనా తోచని నిందారోపణ అది!

రాగిణి చెప్పింది నిజమేనా... ఇటువంటి అనుమానం నాకసలు కలగనే లేదెందుకనీ? బహుశా కుమార్, అంజనా చనువుగా కబుర్లు చెప్పుకోవటం చూసినందువలన అటువంటి అపోహ నాకు కలిగిందన్నమాట...! రాగిణి తమ్ముడు కుమార్ కీ విషయంలో ఏమీ సంబంధం లేదా... నాకు మాత్రం ఇంకా అపనమ్మకంగానే ఉంది.

ఈ విషయం తేల్చుకుందామని, అపుడు ఇంట్లోనే ఉన్న రెండోవాడిని ఈ విషయం కదిపి చూశాను. వాడు చెప్పిన సమాధానంతో నాకు మతిపోయినట్లయింది.

‘అంజనా మీద స్నేహం కన్నా మించిన బంధం ఏదైనా వుందా’ అని అడిగితే, తనకు ఉందని నేను అడగగానే అంగీకరించి, చాలా నిర్లిప్తంగా ‘‘అయితే... ఇపుడు సమస్యేమిటి..?’’ అనడిగాడు.

‘‘పెళ్ళిచేసుకుంటావా ఆ అమ్మాయిని...?’’ అంటూ నేను అడిగిన ప్రశ్నకి వాడి జవాబేంటో తెలుసునా...? ‘నేనా అమ్మాయికి పెళ్ళిచేసుకుంటానని మాట ఏం ఇవ్వలేదే?’ అన్నాడు ఆశ్చర్యంగా మొహం పెట్టి...!

నేను విచిత్రంగా చూస్తూ ‘మరి...నువ్వలాంటి మాట ఏం ఇవ్వకుండానే, ప్రేమలో వున్నాననే భ్రమ తనకి ఎలా కలిగిందీ...?’ అన్నా.

‘ఏమో ఆ విషయం అంజనానే నువ్వడగాలి... పెళ్ళి వాళ్ళకీ, మనకీ ఎలా కుదురుతుందీ...?’

‘పెళ్ళి ఆలోచన లేకుండానే వీళ్ళిద్దరికీ స్నేహం కుదిరిందా? నిజమే... స్నేహానికి పరిమితులు అవసరం లేకపోవచ్చుగానీ ప్రేమకు పెళ్ళి అవసరం ఉందిగా...!’

ఈ విషయాన్ని వాడినే అడిగాను.

‘అది పూర్తిగా ఆ అమ్మాయి ఇష్టం. నేను కూడా తనంటే ఇష్టమేననే మాట మాత్రం చెప్పానంతే. పెళ్ళి చేసుకుంటానని మాట ఇవ్వలేదు గనుక నాకేం సంబంధం లేదు. పెళ్ళి అనేది పూర్తిగా నీ ఇష్ట ప్రకారమే మన అంతస్తుకు తగ్గవాళ్ళనే చేసుకుంటానని ఇపుడు నీకు మాట ఇస్తున్నాను!’

ఆ మాటలకు నాకు కంపరం కలిగింది!